నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 24 జూన్ 2024 | JAGTIAL

## హోంమంత్రి లేకనే అరాచకాలు

బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


పెద్దపల్లి, జూన్ 23 : దేశంలోనే హోం మంత్రి లేని రాష్ట్రం ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, హోంమంత్రి లేకనే శాంతిభద్రతలు గాడితప్పి అరాచకాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో హత్యకు గురైన చిన్నారికి నివాళులర్పిస్తూ పెద్దపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అభం శుభం తెలియని ఆరేండ్ల బాలికపై లైంగికదాడి చేసి హత్యచేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. కేసీఆర్ తన పాలనలో పోలీస్ వ్యవస్థను పటిష్టం చేస్తే.. రేవంత్ సర్కార్ చిన్నాభిన్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. చిన్నారి హత్య కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు ఉరి శిక్ష వేయాలన్నారు. రైస్ మిల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నారి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని మంత్రులు ప్రకటించారని, ఏ ఉద్యోగం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, దాసరి ఉష ఉన్నారు.




# ‘కాళేశ్వరం’ కోసం మరో ఉద్యమం

“కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎం కార్డు అయ్యిందని రాహుల్‌గాంధీ కూడా విమర్శలు చేశారు. కాగ్ ఇచ్చిన నివేదికలో ఇప్పటి వరకు కాళేశ్వరంపై రూ.93 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని స్పష్టం చేసింది. మరీ రాహుల్‌గాంధీ ఆరోపించినట్లు రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుంది. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి. రాహుల్ గాంధీ, ఇతర బీజేపీ నాయకులు అన్నట్లుగా కేసీఆర్ రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడితే మూడు బ్యారేజీలు ఎట్ల పూర్తయ్యాయి. 22 సబ్ స్టేషన్లు, 22 పంప్ హౌస్‌లు, 1,800 కిలో మీటర్ల కాలువలు, అందులో 200 కిలో మీటర్ల టన్నెళ్లు ఎలా పూర్తయ్యాయి. 60 లక్షల ఎకరాలకు నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయి. తెలంగాణ ప్రజలు వట్టి అమాయకులు, ఏది చెప్పినా నమ్ముతారని రాహుల్ గాంధీ అనుకున్నాడేమో..”

“గోదావరి, కృష్ణా నదులను ఆంధ్రా, రాయలసీమకు తరలించేందుకు అప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, చివరికి వైఎస్ జగన్ కూడా ప్రయత్నించారు. కేసీఆర్ దానిని అడ్డుకున్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు ఒక్కటే. రేవంత్‌ను పీసీసీ ప్రెసిడెంట్ చేసింది చంద్రబాబే. సమైక్యాంధ్రలో మనం పెనంపై ఉన్నట్లు ఉండేది. ఇప్పుడు పొయ్యిలో పడిపోయాం.”



చర్చా వేదికలో మాట్లాడుతున్న వీ ప్రకాశ్

- ప్రాజెక్టును కాపాడుకుందాం
- రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు తగవు
- ఈ ప్రాజెక్టుతోనే జీవనోపాధి పెరిగింది
- రూ.లక్ష కోట్ల అవినీతి జరిగితే ప్రాజెక్టు ఎలా పూర్తయింది
- కాళేశ్వరంపై కరీంనగర్‌లో మొదటిసారి చర్చావేదిక
- డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- ప్రధాన వక్తగా హాజరైన జల వనరుల నిపుణుడు వీ ప్రకాశ్
- ఆకట్టుకున్న ప్రసంగం

కాళేశ్వరం ప్రాజెక్టుపై మేధావుల్లో కదలిక వస్తున్నది. రైతుల, ప్రజలను ఏకం చేయాలనే కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ‘కాళేశ్వరాన్ని కాపాడుకుందాం’ అనే అంశంపై ఆదివారం కరీంనగర్‌లోని ఫిల్మ్‌భవన్‌లో డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక చర్చా వేదిక జరిగింది. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు రైతులు, మేధావులు పాల్గొన్నారు. ప్రముఖ జల వనరుల నిపుణుడు వీ ప్రకాశ్ ముఖ్య వక్తగా హాజరవగా, ఆయన చేసిన ప్రసంగం ఆకట్టుకున్నది. తాను ఏ రాజకీయ పార్టీకి చెందిన వాడిని కాదని, బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తర్వాత ఏ పార్టీలో చేరలేదని చెప్పిన ప్రకాశ్ తెలంగాణకు ముందు, తర్వాత పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు, మేధావులు, రైతులు ప్రాజెక్టు అవసరం గురించి వివరించారు.

\- కరీంనగర్, జూన్ 23 (నమస్తే తెలంగాణ)

### మేధావులు స్పందించాలి



కాళేశ్వరం ప్రాజెక్టుపై మేధావులు స్పందించాలి. కేవలం మూడు పిల్లర్లు కుంగిపోతే వచ్చిన ముప్పేమిటి?. మొత్తం ప్రాజెక్టును తప్పుబడతారా..? రాజకీయాల కోసం రైతులను నాశనం చేస్తారా..? కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మూడు, నాలుగేళ్లు నీళ్లు వచ్చినప్పుడు పంటలు ఎట్ల పండినయ్. ఒక్క గుంట పొలం ఎండిపోలేదు. మొన్నటి యాసంగిల పంటలు ఎట్ల ఎండిపోయినయి. ప్రభుత్వానికి ఇదన్నా సోయి లేకుంటే ఎట్లా?. ప్రాజెక్టును కాపాడుకుంటేనే మనకు మనుగడ ఉంటది.

**- సముద్రాల రమణారావు, విత్తనోత్పత్తి సంస్థ నిర్వాహకుడు**

### ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తున్నరు



కాళేశ్వరం ప్రాజెక్టును ఓటు బ్యాంక్ రాజకీయం కోసం వాడుతున్నరు. రాజకీయ పార్టీల మధ్య విబేధాల కారణంగా రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టుతోని ప్రకృతి కూడా మారింది. వరద కాలువలో నీళ్లున్నప్పుడు ఈ ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు పడ్డయి. భూగర్భ జలాలు పెరిగినయి. కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకుంటేనే రైతులు బతుకుతరు. రైతులను కాపాడుకోవాలంటే కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవల్సిందే.

**- గడ్డం భూమారెడ్డి, రైతు (కథలాపూర్)**

### రైతు బాగుంటేనే అన్నీ బాగుంటయ్



రైతులు బాగుంటేనే అన్ని రంగాలు బాగుంటయ్. మన దేశమే వ్యవసాయ ఆధార దేశం. రైతులను బాగు చేసేందుకు ప్రభుత్వాలు ప్రణాళికలు వేయాలి. ఒక ప్రభుత్వం వేసిన ప్రణాళికలు బాగున్నప్పుడు మరో ప్రభుత్వం వాటిని కొనసాగించాలి. ప్రతిదీ రాజకీయ కోణంలో చూస్తే ప్రజలు ఎప్పుడు బాగుపడతరు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుతమైంది. ఈ ప్రాజెక్టును చూసేందుకు దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా వచ్చి చూసి పోయారు. ఇలాంటి ప్రాజెక్టును కేవలం రాజకీయ స్వార్థం కోసం పనికి రాదని వదిలేస్తే ఎంత ప్రజా ధనం దుర్వినియోగం అవుతుంది. ఎంత ఉత్పత్తి ఆగిపోతుంది. అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది.

**- డాక్టర్ మహేశ్ (కరీంనగర్)**



### కేసీఆర్ సర్కారును కోల్పోవడం దురదృష్టకరం

స్వర్ణ యుగాన్ని ఆవిష్కరించిన కేసీఆర్ సర్కారును కోల్పోవడం దురుదుష్టకరం. ఒక ప్రభుత్వం చేసిన మంచి పనిని మరో ప్రభుత్వం కొనసాగించాల్సింది పోయి కక్ష సాధింపునకు పాల్పడుతున్నరు. ఇప్పటి ప్రభుత్వం కేవలం బురద జల్లుడు నేర్చుకున్నది. కాళేశ్వరాన్ని కాపాడుకుందామనే నినాదం ప్రతి గ్రామానికి వెళ్లాలి. ప్రతి రైతు ఇంటి తలుపు తట్టాలి. గతంలో మా నాన్న 9 బోర్లు వేసిండు. రెండు బోర్లు కూడా పనిచేయని పరిస్థితి. కరెంట్ వచ్చిందంటే నేనో బోరుకు, మానాన్నో బోరుకాడికి ఉరికేది. మొదటి మడి తడువక ముందే కరెంట్ పోయేది. ఇప్పుడు 24 గంటల కరెంట్ వచ్చినంక ఇంట్లో కూర్చుండి సెల్ ఫోన్‌తో ఆపరేట్ చేసుకుంటున్నం. మేధావులు రైతులను చైతన్యం చేయాలి. అందరూ ఒక్కటై కాళేశ్వరం ప్రాజెక్టును రక్షించుకోవాలి.

**- బోయినపల్లి మధుసూదన్‌రావు, రైతు (మల్యాల)**



ప్రకాశ్‌ను సన్మానిస్తున్న బీఎన్ రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు, తదితరులు



పాల్గొన్న రైతులు, మేధావులు

### యాసంగి పంటలన్నీ ఎండె..



కాళేశ్వరం నీళ్లు రాకుంటే యాసంగిల పంటలన్నీ ఎండె. మూడేండ్ల సంది కాళేశ్వరం నీళ్లు ఎట్లచ్చినయి. ఎంత మంచి పంటలు పండినయి. మా కథలాపూర్‌లో 2010ల 10 వేల క్వింటాళ్లు పండుడు మహా కష్టముండె. మొన్నటి యాసంగి తప్ప మూడు, నాలుగేండ్ల సంది పసలుకు 35 వేల క్వింటాళ్ల పంట తీసినం. ఇదంతా కేసీఆర్ కాళేశ్వరం కట్టడం వల్లనే సాధ్యమైంది. కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకునెతానికి ఎంత వరకైనా పోరాడెతందుకు రైతులు రెడీగా ఉన్నరు. సరైన వేదిక కోసం ఎదురు చూస్తున్నరు. ఇలాంటి చర్చ ప్రతి మండలంల జరగాలె. రైతులకు సోయి రావాలె.

**- నాగం భూమయ్య, రైతు, కథలాపూర్**

## తుమ్మిడిహట్టి దగ్గర వద్దన్నది ఫడ్నవిస్

- ప్రాణహిత- చేవెళ్లలో వైఎస్ పెద్ద కుట్ర
- ఆంధ్రాకు నీటిని తరలించే కుట్రలను అడ్డుకున్నది కేసీఆరే
- జల వనరుల నిపుణుడు వీ ప్రకాశ్

➲ “తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు వద్దన్నది కేసీఆర్ కాదు. సెంట్రల్ వాటర్ కమిషన్, అప్పటి మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ఎంతో ఉత్సాహంగా అక్కడికి వెళ్లారు. ఒకప్పుడు గోదావరి జలాల కోసం పాదయాత్ర చేసిన నాయకుడు, మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సీహెచ్ విద్యాసాగర్ రావు స్వయంగా పిలిచి ఫడ్నవిస్‌తో మాట్లాడినప్పుడు తన ప్రాణం పోయినా తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టనివ్వని ఫడ్నవీస్ చెప్పాడు. అక్కడ ప్రాజెక్టు కట్టవద్దని గతంలో ఉద్యమం చేశానని, జైలుకు కూడా వెళ్లానని, అలాంటిది తానే అనుమతి ఇస్తే ఎట్లుంటదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు.”

➲ “కేసీఆర్ ప్రాజెక్టును ఎందుకు రీడిజైన్ చేశారంటే.. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెద్ద కుట్ర చేశారు. రూ.38 వేల కోట్లతో 16.45 లక్షల ఎకరాలకు 16 టీఎంసీల నీటి కోసం డిజైన్ చేశారు. ఇందులో కేవలం 1.60 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు అందుతాయి. ప్రాజెక్టులో వెయ్యి కిలోమీటర్ల కాలువలకు మాత్రమే డిజైన్ చేశారు. కేసీఆర్ 1,800 కిలో మీటర్ల కాలువలకు డిజైన్ చేశారు. ఇందులో 200 కిలో మీటర్ల పొడవు అండర్ టన్నెల్స్ ఉన్నాయి. వైఎస్ఆర్ మామూలు మోటర్లు డిజైన్ చేస్తే కేసీఆర్ 139 మెగావాట్ల బాహుబలి మోటర్లకు డిజైన్ చేశారు. 22 లిఫ్టులు, 22 పంప్‌హౌస్‌లు, 22 సబ్ స్టేషన్లు, 3 బ్యారేజీలతో కొత్తగా డిజైన్ చేసి 18.75 లక్షల ఎకరాల పాత ఆయకట్టుకు, 26 లక్షల కొత్త ఆయకట్టుకు నీళ్లందేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కాళేశ్వరాన్ని అన్ని ప్రాజెక్టులతో అనుసంధానం చేశారు. మొత్తంగా 1.35 కోట్ల ఎకరాలకు నీరందించే ప్రణాళిక కేసీఆర్ వద్ద ఉంది. వైఎస్ఆర్ జలయజ్ఞం మొదలు పెట్టి గోదావరి నీళ్లను కోస్తా ఆంధ్రాకు, కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకెళ్లే కుట్ర చేశారు.”

➲ “కాగ్ నివేదికలో అసత్యాలు ఉన్నాయి. అన్ని వ్యవస్థల మాదిరిగానే బీజేపీ కాగ్‌ను కూడా చెప్పుచేతల్లో పెట్టుకుంది. నేను చెప్పేవి నిజాలు. ఎందుకంటే నేను ఏ రాజకీయ పార్టీకి చెందిన వాడిని కాదు. నాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తర్వాత నేను ఏ పార్టీలోనూ చేరలేదు. ఇది నాకు జయశంకర్ సార్ అప్పగించిన బాధ్యత. అందుకే నిజాలను నిర్భయంగా మాట్లాడుతున్న. కాగ్ బీజేపీ చేతిలో వెదురు బద్దలాంటిది. కొట్ట మంటే కొడుతుంది. వంచితే వంగుతుంది. విరిస్తే విరుగుతుంది. అది ఇచ్చిన నివేదికలన్నీ అబద్ధాలే. ఏ ప్రాజెక్టు కట్టినా కాస్ట్ బెనిఫిట్ రేషియో ఉంటుంది. ఎంత ఖర్చయింది. ఎంత ఆదాయం వస్తుందనేది అంచనా ఉంటుంది. ప్రపంచంలో ఏ లిఫ్ట్ ఇరిగేషన్‌కు కాస్ట్ బెనిఫిట్ రేషియో ఉండదు. ప్రాజెక్టు వల్ల ఆదాయం ఎక్కువ వచ్చినా కాగ్ తక్కువ చేసి చూపింది. రూ.88 వేల కోట్లతో ప్రాజెక్టు అంచనా వేస్తే రూ.1.20 లక్షల కోట్లు వరకు వచ్చింది. కానీ కాగ్ ఆరేండ్ల వడ్డీ కలిపి రూ.1.47 లక్షల కోట్లు ఖర్చయినట్లు చూపించింది.”




మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

## సింగరేణిని అమ్మితే ఊరుకోం

- కేంద్రం, రాష్ట్రం కూడబలుక్కొనే బొగ్గు బ్లాకుల వేలం
- కాపాడుకునేందుకు పోరాటానికి సిద్ధం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 23 : ఆరు జిల్లాల్లో విస్తరించి ఉండి.. లక్షలాది మంది బతుకులకు బాసటగా నిలుస్తున్న సింగరేణిని కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడబలుక్కొని అమ్మకానికి పెట్టాయని, అలా చేస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఎన్నికల ముందర ప్రైవేట్‌పరం చేయమని చెప్పిన ఆ రెండు పార్టీలు ఇప్పుడు నల్ల బంగారు గనులను మాయం చేసే కుట్రలు చేస్తున్నాయని విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి.. బాధ్యతలు చేపట్టిన పది రోజుల్లోనే బొగ్గు బ్లాకులను వేలం వేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంలో ఉన్ననాడు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు మిన్నకుండిపోయి ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారని దుయ్యబట్టారు. సమైక్య పాలనలో నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణిని కేసీఆర్ లాభాల బాట పట్టించారని చెప్పారు. ఇలాంటి గొప్ప సంస్థను తాకట్టుపెడితే రాష్ట్ర అభివృద్ధికి గొడ్డలిపెట్టులా మారుతుందన్నారు. 133 ఏండ్ల చరిత్ర కలిగిన సింగరేణిని అమ్మితే ఊరుకోబోమని, కార్మిక సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. ఆదివారం కరీంనగర్‌లోని తన క్యాంపు ఆఫీసులో కొప్పుల విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ తన పదేండ్ల పాలనలో బొగ్గు బ్లాకులను వేలం వేయాలని కేంద్రం ఒత్తిడి తెచ్చినా తలొగ్గలేదన్నారు. సింగరేణిని రక్షించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడారన్నారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు కేంద్రానికి దాసోహమైందన్నారు. ఒకవైపు బొగ్గు బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తున్నామని విలేకరుల ముందర ప్రగల్భాలు పలికిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..ఇప్పుడు వేలంలో పాల్గొనేందుకు సిద్ధపడడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న బొగ్గు నిల్వలను సొంత సర్వే ద్వారా వందల కోట్లు ఖర్చుపెట్టి వెలికి తీసిన సింగరేణిని ప్రైవేట్‌పరం చేయవద్దని డిమాండ్ చేశారు. వేలం వేస్తున్న గనుల నుంచి శ్రావణ్‌పల్లిని మినహాయించాలన్నారు. దీనిపై రాష్ట్ర సర్కారు చొరవ తీసుకోవాలని కోరారు. కేంద్రంలోని మోదీ సర్కారు లాభాల్లో ఉన్న సంస్థను అమ్మకానికి పెడితే సహించేదిలేదన్నారు. సింగరేణిని ప్రైవేట్‌పరం చేస్తే ఉద్యోగాలు పోతాయని, రిజర్వేషన్లు వర్తించవని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కార్మిక సంఘాలు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ రాష్ట్రనేతలు ఓరుగంటి రమణారావు, గంగుల అశోక్ పాల్గొన్నారు.

## ‘నీట్’పై రణం

కరీంనగర్‌లో కదంతొక్కిన విద్యార్థి సంఘాలు

విద్యానగర్, జూన్ 23: నీట్ యూజీ, యూజీసీ నెట్ పరీక్షా పత్రాల లీకేజీపై విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రణానికి దిగింది. పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలు ఆగమైపోతున్నా నోరు మెదపని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటి ముట్టడికి యత్నించింది. బండికి కేంద్రమంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని డిమాండ్ చేసింది. నీట్ యూజీ, యూజీసీ నెట్ పరీక్షా పత్రాల లీకేజీ అంశంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించాలని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా నుంచి ర్యాలీగా నగరంలోని బండి సంజయ్ క్యాంపు ఆఫీస్ వద్దకు చేరుకొని ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజినీకాంత్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కి తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకుడు మాట్లాడుతూ బండి సంజయ్‌కి మత రాజకీయాలపై ఉన్న శ్రద్ధ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌పై లేకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారని దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉద్యమం చేస్తుంటే ప్రధాని మోడీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీకి దేశాన్ని పరిపాలించే హక్కు లేదని, పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని వారు దేశాన్ని ఏం పాలిస్తారని దుయ్యబట్టారు. నీట్ మళ్లీ నిర్వహించేదాకా తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఇక్కడ ఎన్ఎస్‌యూ ఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారావు వెంకటేశ్, మచ్చ రమేష్, అరవింద్, గజ్జల శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు రాణా ప్రతాప్, అంగడి కుమార్ డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు రేణికుంట్ల ప్రితం, మల్లారపు ప్రశాంత్, గంతుల మహేష్, రోహిత్, సనత్ రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి సంఘాల నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల, కార్పొరేటర్లు

## కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గంగుల

- మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు సైతం..
- పార్టీ వెంటే నడుస్తామని వెల్లడి

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 23: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మెదక్ జిల్లా ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో ఆదివారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు కలిశారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో సాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పార్టీ పరిస్థితులపై కేసీఆర్ వీరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతామన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఐక్యంగా పోరాడుతామని తేల్చిచెప్పారు. ప్రజల్లో ఉంటూ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టంచేశారు. నగరాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571